

పోలవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇటుకలకోట పంచాయతీలో వర్షపునీరు గ్రామాన్ని ముంచెత్తే పరిస్థితి తలెత్తింది. దీంతో పంచాయతీ సర్పంచి సున్నం చంద్రమ్మ డ్రెయినేజీల్లో పూడిక తొలగించి తూరలు ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీల పరిధిలో పలు గ్రామాల్లో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక ప్రజానీకం అవస్థలకు గురయ్యారు. పట్టిసీమ, వీరభద్రపురం కాలనీల్లో మోకాలి లోతు నీరు నిలిచి నివాసాల్లోకి నీరు వచ్చి ఇబ్బందులకు గురయ్యారు. పోలవరం మెయిన్ రోడ్డు, బెస్తా వీధి, కమ్మరగూడెం, బిసి కాలనీ, బాపూజీ కాలనీ, కొత్తపేట కాలనీల్లో వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేక నిలిచిపోయింది

స్తంభించిన 'సహకారం'..!

సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలు రాజీనామా
ఏ నిర్ణయమూ తీసుకోకుండా ప్రభుత్వం కాలయాపన
లావాదేవీలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు
ఉమ్మడి జిల్లాలో 256 సహకార సంఘాల్లో పరిస్థితి అంతే
ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు సమాచారం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సహకార సంఘాల్లో (సొసైటీలు) పాలన స్తంభించిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో గత ప్రభుత్వంలో సహకార సంఘాలకు నియమించిన త్రిసభ్య కమిటీల సభ్యుల నుంచి రాజీనామాలు తీసుకోవాలని ఆదేశాలు జారీఅయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 256 సంఘాలు ఉన్నాయి. ప్రతి సంఘంలోనూ దాదాపు వెయ్యి మంది వరకూ రైతులు ఉన్నారు. ప్రతి సంఘానికీ ఛైర్మన్, ఇద్దరు సభ్యులుగా త్రిసభ్య కమిటీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు దాదాపు అన్ని సహకార సంఘాల్లోని సభ్యుల నుంచి అధికారులు రాజీనామాలు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం ఈ కమిటీలకు జులై 30 వరకూ గడువు ఉంది. దీంతో కొంతమంది సభ్యులు రాజీనామాలు చేసేందుకు నిరాకరిస్తున్నట్లు సైతం తెలుస్తోంది. ఈ విధంగా మొండికేసిన జాబితాలో ఏలూరు జిల్లాలో 28 మంది సభ్యులు ఉన్నట్లు తెలిసింది. వీరిని ఏవిధంగా తొలగిస్తారో వేచిచూడాలి. సభ్యుల రాజీనామాల వివరాలను సహకార సంఘాల అధికారులు ప్రభుత్వానికి పంపించారు. జూన్ ఏడో తేదీ నుంచి త్రిసభ్య కమిటీలు పని చేయడం లేదు. దాదాపు 20 రోజులుగా సహకార సంఘాలకు పాలకవర్గం అనేది లేకుండా పోయింది. సొసైటీ ఛైర్మన్, లేక అధ్యక్షుడు లేకపోతే సంఘాల లావాదేవీలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. అందుకే పదవీ కాలం ముగియడమూ ఒకటి, రెండు రోజుల ముందే పొడిగింపు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతోంది. 20 రోజులుగా పాలకవర్గం లేకపోవడంతో లావాదేవీలు మొత్తం ఆగిపోయాయి. రైతుల నుంచి రుణాల సొమ్ము కట్టించుకుని తిరిగి రైతులకు రుణం ఇవ్వాలంటే కార్యదర్శి, ఛైర్మన్ సంతకాలు కావాల్సి ఉండటంతో ఆగిపోయాయి. డిపాజిట్‌దారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. వసూలు చేసిన సొమ్ము చెల్లింపులకు అవకాశం లేకపోవడంతో సొసైటీ వడ్డీ నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇలా అనేక సమస్యలు సహకార సంఘాలను చుట్టుముట్టాయి. సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు ప్రచారం సాగుతున్నా ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో పరిస్థితి మరింత దిగజారుతుందని చెప్పొచ్చు. సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ చేపట్టడంతోపాటు అప్పటి వరకూ ప్రత్యేక అధికారులను నియమించాలని అంతా కోరుతున్నారు.

నామినేటెడ్ పోస్టుల తరహాలో సహకార సంఘాల పాలకవర్గాలు

సహకార సంఘాల ఎన్నికలు జరిగి ఏళ్లు గడిచిపోయాయి. 2013 జనవరిలో అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించింది. వీటి గడువు 2018 జనవరితో ముగిసిపోయింది. అప్పటి టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా అప్పటి పాలకవర్గాలనే పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2019 జులై వరకూ ఏడాదిన్నరపాటు ఇవి కొనసాగాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారని అంతా భావించారు. అయితే త్రిసభ్య కమిటీ పేరుతో ఒకరిని ఛైర్మన్, ఇద్దరిని సభ్యులుగా నియమించి పాలన సాగించింది. ఆరు నెలలకు ఒకసారి ఈకమిటీల పదవీకాలం పొడిగిస్తూ కాలం వెళ్లదీసింది. ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పోస్టుల తరహాలో భర్తీ చేస్తూ రాజకీయ పోస్టుల్లా మార్చేసింది. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సహకార వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. ఎన్నికలు జరిగితే ప్రతి సంఘానికీ అధ్యక్షునితోపాటు 11 మంది సభ్యుల వరకూ ఉంటారు. ఇది సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేదిశగా పనిచేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వాలు అటువైపు ఆలోచించికపోవడం దారుణంగా చెప్పొచ్చు.

ఒకటి, రెండు రోజుల్లో ప్రత్యేక అధికారుల నియామకం

ఆరిమిల్లి శ్రీనివాస్, సహకార సంఘాల అధికారి, ఏలూరు

జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లోని త్రిసభ్య కమిటీ సభ్యుల నుంచి రాజీనామాలు ప్రభుత్వానికి నివేదించాం. 28 మంది సభ్యుల వరకూ రాజీనామాలు ఇవ్వలేదు. వాటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సహకార సంఘాలకు ఒకటి, రెండు రోజుల్లో ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం ఉంది. అప్పటి వరకూ ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నాం.

డిఎస్‌సిపై స్పష్టత కరువు..!

తొలి సంతకాలకు మంత్రిమండలి ఆమోదం
డిసెంబర్ పదో తేదీలోపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
టెట్ కం డిఎస్‌సినా, వేర్వేరు పరీక్షలా?
జులైలో రూ.ఏడు వేల పెన్షన్ అందజేత
అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పలువురికి మేలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం తర్వాత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుకు చేసిన తొలి ఐదు సంతకాలకు సోమవారం జరిగిన తొలి మంత్రిమండలి సమావేశం ఆమోద ముద్ర వేసింది. డిసెంబర్ పదో తేదీలోపు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తి కానుంది. రెండు జిల్లాల్లో 1200 పోస్టుల వరకూ భర్తీ అయ్యే అవకాశం ఉండటంతో డిఎస్‌సి అభ్యర్థులంతా చదువుల్లో మునిగి తేలుతున్నారు. అయితే ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తుందనే అనుమానాలు మాత్రం అందరినీ వెంటాడుతున్నాయి. మంత్రివర్గ సమావేశం తర్వాత కూడా దీనిపై స్పష్టత రాని పరిస్థితి నెలకొంది. టెట్ కం డిఎస్‌సి నిర్వహిస్తారా.. లేక టెట్ ప్రత్యేకంగా, డిఎస్‌సి పరీక్ష ప్రత్యేకంగా నిర్వహిస్తారా అనేది తేలాల్సి ఉంది. నిబంధనల ప్రకారం ఆరు నెలకోసారి టెట్ నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల ముందు టెట్ నిర్వహించినా ఫలితాలు ప్రకటించలేదు. ఒకసారి టెట్ రాసి క్వాలిఫై అయితే ఆ అభ్యర్థి డిఎస్‌సి పరీక్ష రాసినంత కాలం ఉపయోగపడుతుంది. టెట్ పరీక్ష 150 మార్కులకు నిర్వహిస్తున్నారు. టెట్‌లో వచ్చిన మార్కులను డిఎస్‌సిలో 20 శాతం మార్కులుగా కలుపుతారు. ఇప్పుడు టెట్ కం డిఎస్‌సి నిర్వహిస్తే వంద మార్కులకు పరీక్ష పేపర్ ఉంటే 80 మార్కులకు డిఎస్‌సి, 20 మార్కులకు టెట్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. దీనివల్ల అభ్యర్థులకు నష్టం తప్ప లాభం లేదనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే టెట్ రాసిన వారు ఇప్పుడు కావాలనుకుంటే రాస్తారు, లేకపోతే వదిలేస్తారు. డిఎస్‌సి పరీక్షకు పూర్తిగా సన్నద్ధమవుతారు. టెట్ కం డిఎస్‌సి నిర్వహిస్తే రెండు పరీక్షల సిలబస్ చదవాల్సి ఉంటుంది. అప్పుడు అభ్యర్థులపై ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే అభ్యర్థులంతా కోచింగ్ సెంటర్లలో సొమ్ము చెల్లించి డిఎస్‌సికి సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం డిఎస్‌సి, టెట్ పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

జులైలో రూ.ఏడు వేలు పెన్షన్

కొత్త ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న రూ.మూడు వేల పెన్షన్‌ను రూ.నాలుగు వేలకు పెంచుతూ మంత్రిమండలి సమావేశం ఆమోద ముద్రవేసింది. అంతేకాకుండా పెంచిన పెన్షన్‌కు సంబంధించిన ఏప్రిల్, మే, జూన్ నెలల ఎరియర్స్ సొమ్ము మూడు వేలు సైతం చెల్లించనుంది. దీంతో ప్రతినెలా ఇచ్చే రూ.నాలుగు వేల పెన్షన్‌తోపాటు ఎరియర్స్ కింద రూ.మూడు వేలు మొత్తం జులైలో రూ.ఏడు వేలు సొమ్ము పింఛన్ లబ్ధిదారులకు అందనుంది. దీంతో రెండు జిల్లాల్లో 6.02 లక్షల మంది పెన్షన్‌దారులకు లబ్ధి చేకూరనుంది. ఇక నుంచి ఇంటికి సచివాలయ ఉద్యోగులే పెన్షన్ అందించనున్నారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పట్టణాల్లో నిరుపేదలకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది.

రైళ్ల రద్దుతో ఉద్యోగులు, విద్యార్థుల అవస్థలు

విజయవాడ-రాజమండ్రి మధ్య ఇంటర్‌సిటీ నడపాలని వినతి
లేనిపక్షంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరించాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రూట్‌లో పలు రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణికులు నానావస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. బస్సులకు వెళ్లాల్సి రావడంతో ఉద్యోగులు, విద్యార్థుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రైల్వేస్టేషన్లు, రైల్వేట్రాక్, సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో రైల్వే స్టేషన్లు ఆధునికీకరించడంతోపాటు ట్రాక్ మరమ్మతులు, సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణ పెద్దఎత్తున చేపట్టారు. ఆ పనుల రీత్యా విజయవాడ-విశాఖ మార్గంలో పలు రైళ్లను రద్దు చేశారు. ప్రతిరోజూ విజయవాడ నుంచి కాకినాడ వరకు అనేకమంది ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అందులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, రాజమండ్రి స్టేషన్లకు సుమారు 200 మంది ఉద్యోగులు సీజన్ టికెట్లు తీసుకుని విధులకు రోజువారీ వెళ్లొస్తూ ఉంటారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నుంచి ప్రతిరోజూ రైలు ప్రయాణం చేసే ఉద్యోగులు కొంతమంది తాడేపల్లిగూడెం స్టేషన్లో దిగి తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఆ చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లొస్తూ ఉంటారు. మరికొంత మంది నిడదవోలు స్టేషన్లో, మరికొంతమంది కొవ్వూరు, గోదావరి, రాజమండ్రి, సామర్లకోట ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తుంటారు. ఏలూరు తర్వాత వచ్చే తాడేపల్లిగూడెం స్టేషన్లలోనూ పెద్దసంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్‌లు అనువుగా ఉండేవి. ఈ రైలు ఏడు గంటల తర్వాత ఏలూరు నుంచి బయల్దేరి 9:45 గంటల్లోపు సామర్లకోట చేరుకుంటుంది. ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉద్యోగులు తమ కార్యాలయాలకు వెళ్లే అవకాశం ఉండటంతో ఎక్కువగా ఈ రైలును ఆశ్రయిస్తారు. అలాగే సాయంత్రం తిరుగు ప్రయాణంలో 4.50 గంటల తర్వాత 5:30లోపు రత్నాచల్, ప్రశాంతి, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లు ఉండటంతో ఉద్యోగులు వాటిలో తిరుగుముఖం పట్టేవారు. ఇక ఛార్జీల విషయానికి వస్తే ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోటలకు నెలకు సీజన్ టిక్కెట్ రూ.480 నుంచి రూ.600లోపే ఉంటుంది. అంటే రోజుకి రూ.20లోపే ఖర్చవుతుంది. ప్రతిరోజూ ఏలూరు నుంచి 200 మందికిపైగా ఉద్యోగులు సీజన్ టిక్కెట్ తీసుకుని రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అయితే ఈ ఆధునికీకరణ పనుల వల్ల తిరుపతి నుంచి వచ్చే కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ మొదటి వారంలోనే రద్దు చేశారు. దాంతో వేరే అవకాశం లేక రద్దీగా ఉన్నప్పటికీ ఉద్యోగులంతా రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌నే ఆశ్రయిస్తూ వచ్చారు. సోమవారం నుంచి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేయడం, మళ్లీ ఆగస్టు 10వ తేదీన ప్రారంభించనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించడంతో ఉద్యోగులు నానావస్థలు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బస్సులను ఆశ్రయించాల్సి వస్తుంది. బస్సుల్లో వెళ్లడం వల్ల ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల వరకు అదనపు ఖర్చులు పెరగడమేకాక ప్రయాణ సమయం గంటన్నర నుంచి రెండు గంటల వరకు పెరిగే పరిస్థితి వచ్చింది. గతంలో రూ.480 వెచ్చించి సీజన్ టిక్కెట్ తీసుకుని ఏలూరులో రైలు ఎక్కితే 35 నిమిషాల్లో తాడేపల్లిగూడెం చేరుకునేవారు. ఇప్పుడు అదే తాడేపల్లిగూడెం బస్సుకు వెళ్లాలంటే రానుపోను రోజుకి రూ.200 వరకూ బస్సును బట్టి ఖర్చు పెట్టాల్సి వస్తుంది. అంతేగాక ప్రయాణ సమయం 35 నిమిషాల నుంచి గంటకుపైగా పెరిగింది. ఇదే పరిస్థితి నిడదవోలు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు ఎదుర్కొంటున్నారు. నిడదవోలుకు ఎక్కువగా బస్ సర్వీసులు లేకపోవడంతో తాడేపల్లిగూడెం చేరుకుని అక్కడ నుంచి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగానైనా ఉద్యోగుల కోసం విజయవాడ నుంచి రాజమండ్రి వరకు ఒక ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలని ఉద్యోగులు కోరుతున్నారు. దీనిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ దృష్టి పెట్టి రైల్వే అధికారులతో మాట్లాడాలని అంతా కోరుతున్నారు. కనీసం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌నైనా బోగీలు పెంచి పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (ఫైల్‌ఫొటో)

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం

156 అర్జీల స్వీకరణ
జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో అందిన అర్జీలకు సత్వర పరిష్కారాన్ని అందించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణితోపాటు డిఆర్ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, ఎం.ముక్కంటి, సర్వశిక్షాభియాన్ ఎపిసి బి.సోమశేఖర్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. దీనిలో 156 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ దరఖాస్తులను నాణ్యతతోపాటు నిర్దేశించిన సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుండి సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు అందించిన వినతులను పరిశీలించి నాణ్యతతో వాటి పరిష్కారానికి సంబంధించిన అర్జీని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అర్జీలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు. న్యాయ సంబంధమైన సమస్యల అర్జీలను పరిష్కరించడంలో అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెవి.సుబ్బారావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, డిఇఒ కె.అబ్రహం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న జెసి లావణ్యవేణి

రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం వినతి

ఏలూరు అర్బన్ :జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించి అన్నదాతలను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి కలెక్టర్ లావణ్య వేణికి కలెక్టరేట్‌లో గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు రైతాంగ సమస్యలను వివరించారు. జిల్లాలో రబీ ధాన్యం అమ్మిన రైతులకు ఇవ్వాల్సిన రూ.240 కోట్లు ధాన్యం బకాయి సొమ్ముల నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించేందుకు గత ప్రభుత్వం జారీ చేసిన జిఒ 22ను రద్దు చేయాలని కోరారు. పాడి రైతులకు లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వా లన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దును అసెంబ్లీలో చట్టం చేయాలని కోరారు. సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి కచ్చితమైన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని, పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని, ఈ పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు కోరారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎ బాలరాజుకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో పేరుకుపోయిన గిరిజన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ తరపున పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు సోమవారం వినతిపత్రం అందించినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో ఎంఎల్ఎను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌టిఆర్ 1/70 చట్టం కేసుల పరిష్కారానికి ఎస్‌డిసి పిఒ కోర్టులు నడపాలని, వివాదంలో ఉన్న భూముల పరిష్కారానికి అధికారులు నూతన కమిటీలను వేయాలని, పోడు భూములకు గ్రామ సభలు జరిపి సర్వే నిర్వహించి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. నిర్వాసితుల పోడు భూములకు పరిహారం ఇవ్వాలని, బుట్టాయగూడెం మండలంలోని మర్లగూడెం, పద్మవారిగూడెం, పోలవరం మండలం వింజరం, జీలుగుమిల్లి మండలం జగన్నాథపురంలలో భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్అర్ ప్యాకేజీ ఇవ్వాలని, మౌలిక సౌకర్యాలతో కాలనీలు పూర్తి చేయాలని, గిరిజన డిఎస్‌సి ప్రకటించాలని కోరారు. ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ నాయకులు తెల్లం రామకృష్ణ, నాయకులు ఎస్.సీతారామయ్య, గుడెల్లి వెంకట్రావు, సిహెచ్.కొండలరావు, దానియేలు, దావీదు పాల్గొన్నారు.


ఎంఎల్ఎ బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

27న జెడ్‌పి స్థాయి సంఘ సమావేశాలు

ఏలూరు :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 27వ తేదీ ఉదయం పది గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్‌లోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్‌హెచ్ నిర్మాణంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

అధికారులతో జెసి లావణ్యవేణి సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో దెందులూరు నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలపై జులై పదో తేదీ లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి సోమవారం సాయంత్రం జాతీయ రహదారి, రోడ్లు, భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులతో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి-16లో హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను వరకు దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు మండ లాల్లోని కొన్ని ప్రదేశాల్లో నిబంధనల మేరకు సర్వీస్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వంటి పనులు సక్రమంగా జరగని కారణంగా, రహదారిలో కొన్ని ప్రాంతాల్లో ఎత్తుపల్లాలు ఉండడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని, డ్రెయిన్లు, కల్వర్టులు సక్రమంగా నిర్మించని కారణంగా సాగునీరు, వర్షపునీరు ప్రవాహానికి సమస్య ఏర్పాడుతుం దన్నారు. ఇటువంటి వాటిని 16 అంశాలు తెలియజేశారని, వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎంఎల్ఎ తెలియజేశారన్నారు. సమస్యలపై జులై పదో తేదీలోగా చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని జాతీయ రహదారి, రోడ్లు, భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులను జెసి ఆదే శించారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్వహణలో భాగంగా ప్రతి నెలా రూ.24 లక్షల మేర ప్రభుత్వం సంబంధిత కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తుందని, నిర్వహణ పనుల్లో కనీసం రహదారి మధ్యలో మొక్కల పెంపకం, వాటి నిర్వహణ, రోడ్ల మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ చేయడంలే దన్నారు. నిబంధనల మేరకు వాటర్ ట్యాంకర్, జెసిబి, పలు పరిక రాలు ఏమీ లేక నిర్వహణ చేయడం లేదన్నారు. వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ సమా వేశంలో ఆర్అండ్‌బి సూపరింటెండింగ్ ఇంజినీర్ జాన్ మోషే, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె. ఖాజావలీ, జాతీయ రహదారి సంస్థ అధికారులు, సిబ్బంది, రెవెన్యూ, ఆర్అండ్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

వరుణుడి కోసం రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి - మండవల్లి

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. మెట్టదుక్కులు దున్ని పొలాన్ని సాగుకు సిద్ధం చేసి నీటి కోసం ఎదురుచూస్తున్నారు. కాలువలో నీరు లేకపోవడం, వర్షపు జాడ కానరాకపోవడంతో వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మండలం లో అయ్యావారి రుద్రవరం, పెరికే గూడెం, లింగాల, కానుకొల్లు, గన్నవరం, మండవల్లి, లేళ్లపూడి గ్రామాల్లో సుమారు 1600 మంది రైతులు సుమారు మూడు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వర్షాలు పడతాయని ఆశతో ఇప్పటికే భూమిని వేలాది రూపాయలు ఖర్చు పెట్టి రెండు మూడు సాళ్లు దుక్కు దున్ని వరి సాగుకు సిద్ధపడ్డారు. దమ్ము ఆకుతీత ఉడుపు తదితర పనులకు ఎకరానికి సుమారు రూ.ఏడు వేల నుంచి రూ.ఎనిమిది వేల వరకు ఖర్చులు తగ్గడంతో రైతులంతా వెద పద్ధతిలోనే సాగు చేసేందుకు సుముఖత చూపుతున్నారు. స్వర్ణ, సంపద స్వర్ణ అనే రకం వరి విత్తనాన్ని ఎకరానికి 30 నుంచి 40 కిలోల వరకు వినియోగిస్తున్నారు. ఈ సంవత్సరం సాగు చేసేందుకు భూమిని ముందుగానే సర్వం సిద్ధం చేశామని భారీ స్థాయిలో వర్షం కురిస్తే వరి విత్తనాలను ఎద జల్లేందుకు సిద్ధంగా ఉన్నామని రైతుల స్పష్టం చేస్తున్నారు. పెరికేగూడెం, లింగాల గ్రామాల్లో కొంతమేర రైతులు వరి విత్తనాలను వెద జల్లి సాగుకు సిద్ధమైపోయారు.

పొలాన్ని సిద్ధం చేసుకున్న
కుంచె ఓగి, రైతు

నాకు సొంతంగా ఎకరం పొలం ఉంది. ఇప్పటికి రెండు సాళ్లు మెట్ట దుక్కు దున్ని పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. వర్షం కోసం, కాలువల్లో నీరు కోసం ఎదురుచూస్తున్నాను. వర్షం పడినా, కాలువల ద్వారా నీళ్లు వచ్చినా పట్లర్‌తో మరోసారి దుక్కు దున్ని వరి విత్తనాలను వెద జల్లుతాను.

వెద జల్లడం వల్ల ఖర్చులు తగ్గుతాయి
పరస బసయ్య, రైతు

నాకు రెండు ఎకరాలు సొంత పొలం ఉంది. దాంతోపాటు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. తొమ్మిది ఎకరాలను వెద జల్లు పద్ధతిపై వరి సాగు చేయడానికి సిద్ధం చేశాను. ఎద పద్ధతిలో వ్యవసాయం చేయడం వల్ల తొమ్మిది ఎకరాలపై సుమారు రూ.50 నుంచి రూ.60 వేలు వరి సాగులో ఖర్చు తగ్గుతుంది.

కలుపుపై జాగ్రత్త వహిస్తే అధిక దిగుబడి
ఎఒ జరీనా

వ్యవసాయంలో వెద జల్లి వ్యవసాయం చేయడం పద్ధతి మంచిది. ఎద పద్ధతిలో సాగు చేసే రైతుకు ఖర్చులు తగడంతో పాటు విత్తనాన్ని శుద్ధి చేసుకున్న తదుపరి వెద జల్లుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు. విత్తనాన్ని వెదజల్లడం ద్వారా విత్తనానికి గాలి వెలుతురు బాగా తగిలి మొక్క ఏపుగా ఎదుగుతుంది. కలుపులో మాత్రం జాగ్రత్త వహిస్తే రైతుకు మంచి దిగుబడి సాధించవచ్చు. వరి విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తున్నామని, వాటితో పాటు జీలుగ, పిల్లిపెసర్లు కూడా రాయితీపై రైతులకు అందిస్తున్నామని తెలిపారు.

పుట్రేపులో భారీ కొండచిలువ హతం

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామస్తుల చేతిలో 12 అడుగుల భారీ కొండచిలువ హతమైన సంఘటన మండలంలోని పుట్రేపులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు ఇంటి సమీపంలో ఉన్న కోళ్ల గాబులో భారీ కొండచిలువ ప్రవేశించి కోడి పుంజును మింగేస్తున్న క్రమంలో కోళ్ల అరుపులతో కుటుంబ సభ్యులు చూడగా కొండచిలువ కనబడింది. దీంతో ప్రమాదం పొంచి ఉండడంతో స్థానికుల సాయంతో దానిని హతమార్చారని తెలిపారు. గ్రామ సమీపంలో కావడంతో మనుషులు సంచరిస్తుంటారని, ఇటువంటి పరిస్థితుల్లో పెద్ద కొండచిలువ సంచరించడం ప్రమాదకరమని గ్రామస్తులు చెబుతున్నారు. సుమారు 12 అడుగులు ఉన్న కొండచిలువ కోళ్లు, మేకలను సహితం చంపి మింగగలదని వారంటున్నారు.



హతమైన కొండచిలువ

వడాలిలో శిలాఫలకాలు ధ్వంసం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలిలో కొన్ని రోజులుగా వైసిపికి చెందిన శిలాఫలకాలు గుర్తు తెలియవ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు ఐదో తేదీన గ్రామంలోని హరిజనవాడ శ్మశానవాటికకు వెళ్లే సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. తాజాగా ఆదివారం రాత్రి గ్రామంలోని సచివాలయం శిలాఫలకాన్ని కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండా దిమ్మె రాడ్డును కూడా ధ్వంసం చేయడంతో గ్రామంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ రీతిగా వైసిపికి చెందిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా శిలాఫలకాలను ధ్వంసం చేయడంతో పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామ సచివాలయాన్ని సందర్శించి శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తుల ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. శిలాఫలకాలు ధ్వంసం చేసిన వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.


ధ్వంసమైన శిలాఫలకం



బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

అగ్ని ప్రమాద బాధితులకు కాంగ్రెస్ సాయం

ప్రజాశక్తి - పోలవరం

కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పోలవరం మండలాధ్యక్షులు ముచ్చికి సీత, ఆధర నాయకులు సోమవారం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ముచ్చికి సీత మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు బట్టలు, రూ.5 వేల ఆర్థిక సాయం, మంచం, పరుపు, దిండ్లు, దుప్పట్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎపిసిసి ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్ర, బుట్టాయగూడెం మండలాధ్యక్షులు కుటుంబరావు, కొయ్యలగూడెం మండల నాయకులు కె.రాజారత్నం పాల్గొన్నారు.

రామారావు మరిన్ని సేవలందించాలి

తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు

ప్రజాశక్తి - ముసునూరు




సైకిళ్లు అందిస్తున్న రామారావు

సేవా దృక్పథం కలిగిన రాయ్యుకుల రామారావు మరిన్ని సేవలందించాలని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాల, బాలికలకు రాయ్యుకుల రామారావు తమ సొంత ఖర్చులతో మరో 20 నూతన సైకిళ్లను విద్యార్థులకు అందించారు. ఆయన గత 15 రోజుల క్రితం కొంతమంది విద్యార్థులకు సైకిళ్లు అందించారు. మిగిలిన విద్యార్థులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా రాయ్యుకుల రామారావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సాయిబాబు మాట్లాడుతూ గుడిపాడుకు చెందిన రాయ్యుకుల రామారావు ఆ గ్రామంలోనే కాకుండా మరికొన్ని గ్రామాలకు కూడా సేవలందిస్తున్నారన్నారు. తమ పాఠశాలకు ఎన్నో సహాయం, సహకారాలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొల్లి గంగారావ్, మండలం ధర్మరాజు, కొల్లి కృష్ణయ్య, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

నిరంతరం శ్రమిస్తూ ప్రజాశ్రేయస్సుతో పాటు నియోజకవర్గాభివృద్ధికి కృషి చేస్తానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. తనను కలిసేందుకు వచ్చే వారంతా తన కోసం బొకేలు, శాలువాలు వంటివి కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలను తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆ నిరాదేశాన్ని అనుసరించి పలువురు నోటు పుస్తకాలను తీసుకొచ్చి ఆయనకు అందిస్తున్నారు. అలా వచ్చిన పుస్తకాలను ఎక్కడికక్కడ విద్యార్థులకు పంపిణీ చేస్తూ వస్తున్నారు. తాజాగా ఏలూరు వైఎస్ఆర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ పరిధిలోని పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తానని ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను కలువవచ్చన్నారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఎంఎల్ఎను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలపై స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, డివిజన్ ఇన్‌ఛార్జి పెరుగుమాల శ్రీనివాసరావు, మాజీ ఎంపిటిసి దావులూరి, పలువురు టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పలు చట్టాలపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలో బాలికల పాఠశాలను స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్ డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ట్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ చైతాని సూర్యచక్రవేణి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు ప్రతి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అతిగా వినియోగించొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 కిరణ్ బాబు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రూప్సేరాణి, ఐసిడిఎస్ పిఒ మాధవి, సూపర్‌వైజర్ లీలాకుమారి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని మోడల్ ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్‌గా రూపొందిస్తామని జిల్లా కో-ఆర్డినేటర్ జె.ప్రసంగిరాజు అన్నారు. సోమవారం ఆయన సందర్శించారు. గ్రామంలో చెత్త సేకరణ, వాటి నుంచి వర్మి కంపోస్టు తయారీ విధానంపై ఆయన సంతృప్తి చెందారు. లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా చేబ్రోలు పెట్టును ఎంపిక చేసేందుకు జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. ప్రతిరోజూ క్లాప్ మిత్ర ద్వారా ఇంటింటా చెత్తను సేకరిస్తున్నారని సర్పంచి రాంధే లక్ష్మి సునీత వివరించారు. పంచాయతీ కార్యదర్శి జె.నాగేశ్వరరావు, డిపిఆర్ భూషణం, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమయంలో మార్పు

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని ఆడమిల్లిలోని 400 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు చిన్నమ్మరావుపాలెం ఫీడర్ నుంచి వ్యవసాయ మోటార్లకు వచ్చే త్రీఫేజ్ విద్యుత్ ఉదయం మూడు గంటల నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం సమయంలో ఇవ్వనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలిపారు. ఆడమిల్లి శివారు చిన్నమ్మరావుపాలెం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన అర్బా వాటర్ ప్లాంట్‌ను టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైకుల చోరీ, నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం


ద్విచక్రవాహనాల దొంగతనంతో పాటు నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ డి.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్కినవారిగూడెం పంచాయతీలోని గోరే శంకరపురం గ్రామానికి చెందిన మొల్లేటి రాంబాబు ప్రభుత్వం నాటు సారా తయారు చేసి విక్రయించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతంలో జరిగే జాతరలలో బైకు చోరీలకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎసిఐ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో గోరే శంకరపురం గ్రామంలో కాపుకాసి ఉన్న రాంబాబును అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా, 26 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రాంబాబును చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నవంబర్ నాటికి వంద పడకల ఆసుపత్రి పూర్తి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

నవంబర్ నెల నాటికి చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి పూర్తి చేస్తామని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన సోమవారం పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సహాయం గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యుల పనితీరు, నర్సుల ప్రవర్తన గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పాయిజన్ కేసులు ఎక్కువ వస్తున్నాయన్నారు. పాయిజన్ కేసులు రాకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని డాక్టర్లకు సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ప్రతి రోగిని క్షుణ్ణంగా పరిశీలించాలని, వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ఆసుపత్రికి అవసరమైన పరికరాలు, సిబ్బంది కొరత, మందుల కొరత ఏది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచాలన్నారు. సాధారణ డెలివరీ చేసేలా అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు, నర్సుల పనితీరు ఎప్పటికప్పుడు తెలుసుకుంటానన్నారు. అందరూ బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వంద పడకల ఆసుపత్రికి సంబంధించిన ఫుల్ డిజైన్ జులై ఎనిమిదో తేదీ నాటికి అధికారులు ఇవ్వాలని కోరారు. చింతలపూడి వంద పడకల ఆసుపత్రి బ్లూ ప్రింట్‌ను ఆయన పరిశీలించారు. త్వరగా వంద పడకల ఆసుపత్రి పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేవిధంగా అందరూ కృషి చేయాలన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు సన్నాహాలు

సాధ్యమైనంతవరకు రెండు నెల్లలో చింతలపూడి నగర పంచాయతీకి సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగర పంచాయతీని అభివృద్ధి చేయాలని, సెంట్రల్ లైటింగ్ లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఎన్నికల ముందు ప్రజలు తమ గోడును చెప్పారన్నారు. యుద్ధ ప్రాతిపదికన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నగర పంచాయతీలో రోడ్లు, వీధి లైట్లకు ముందు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేయమని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో సుమారు రూ.38 లక్షలు ఖర్చవుతుందని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాజీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదరాల మధుబాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ఐటిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడ అవినాష్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, టిడిపి నాయకులు, తాటి అప్పారావు, టిడిపి యువ నాయకులు తాటి సింహ, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ'కు పలు వినతులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి నాలుగు అర్జీలు వచ్చాయని ఆర్‌డిఒ భవానీశంకరి తెలిపారు. పట్టణానికి చెందిన ముగ్గురు, ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన ఒకరు అర్జీలను అందించినట్లు చెప్పారు. ఈ అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. నూజివీడు తహశీల్దార్ కార్యాలయంలో ఎటువంటి అర్జీలు రాలేదని తహశీల్దార్ ఎ.విశ్వనాథ్‌శాస్త్రి తెలిపారు.

ఉంగుటూరు : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. తహశీల్దార్ కట్టా శివయ్య, ఇఒపిఆర్‌డి షేక్ సంషుద్దీన్, హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు, వ్యవసాయ శాఖ ఎఒ వెంకటేష్, ఎంపిడిఒ కార్యాలయం పర్యవేక్షకులు ఆంజనేయులు, ఎపిఒ మల్లేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు. ఆరు అర్జీలు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పరిష్కారం కోసం ఫార్వర్డ్ చేస్తామని అధికారులు తెలిపారు.

జీలుగుమిల్లి : ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించినట్లు ఎంపిడిఒ కెఎం.మంగతాయారు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే ఉదయం నుంచి జరిగిన ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ప్రజల నుంచి ఒక్క వినతి (అర్జీ) కూడా రాలేదని తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం నూతనంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ప్రజలందరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరరావు, ఎంఇఒ కె.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సభలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని వినతి

మండవల్లి : గ్రామాల అభివృద్ధికి, ప్రగతికి కీలకమైన గ్రామసభలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎస్.భాస్కరరావు, అప్పారావు స్పష్టం చేశారు. నిలుపుదల చేసిన గ్రామసభలను షెడ్యూల్ విడుదల చేసి జులై మొదటి నుంచి 29 గ్రామ పంచాయతీల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ జెఎస్.సుభానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బండి రంగారావు, బండి దివాకర్, మారగాని రామచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు మండలం కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సోమవారం కిట్లు పంపిణీ చేశారు. తొలుత కొవ్వలి గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందించారు. ప్రభుత్వం ఇస్తున్న పుస్తకాలతో పాటు, తాను సొంతంగా నోటు పుస్తకాలు అందించారు.

ముసునూరు : బాగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని లోపూడి గ్రామ సర్పంచి పేరం కృష్ణ చెప్పారు. మండలంలోని లోపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం యుపి స్కూల్లో బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగులు టిడిపి నాయకులు లక్క పాము కాంతారావు, పేరం వెంకటరత్నం, పొదల కృష్ణ సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్ మాధవి లత పాల్గొన్నారు.

టి.నరసాపురం : విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయులు షేక్ సయ్యద్ అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీలోని వందరామన్నపాలెం గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు పిఎస్.పవన్‌కుమార్ స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సురేష్, వై.వెంకట్రావు, కె.శ్రీను, జనసేన నాయకులు వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మండవల్లి : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఉప సర్పంచి తలపంటి ఆంజనేయులు అన్నారు. గన్నవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టిడిపి నాయకులతో కలిసి విద్యార్థులకు కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే క్రమశిక్షణతో కూడిన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కోనపరెడ్డి కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు పాండురంగారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు, నామాల చైతన్య, గుడివాడ ప్రసాద్, దామినేని మురళి, కోనపరెడ్డి ఆంజనేయులు (అప్పన్న), వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు చెప్పారు. నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక 25వ వార్డు యానాదుల కాలనీలో సోమవారం శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు చేశారు. కాలనీలో డ్రెయినేజీలను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణ మందు పిచికారీ చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

డయేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

జిల్లాలో పలుచోట్ల డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు అధ్యక్షతన పంచాయతీ సెక్రటరీ కొండలరావు ఆధ్వర్యంలో పోలవరం మండల కేంద్రంలో పలు సచివాలయాల సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కొండలరావు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంచినీటి వాటర్ ట్యాంకులను 15 రోజుకోసారి శుభ్రం చేయాలని, క్లోరినేషన్ జరిగేటట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ గంగాభవాని, సచివాలయ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - మండవల్లి

పొలంలో ఉన్న కలుపును భూమిలో కలపడం ద్వారా పచ్చ రొట్టిగా మారి మొక్కలకు ఉపయోగపడుతుందని ఎడిఎ జి.వెంకటమణి స్పష్టం చేశారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ సాగు సహాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలన్నారు. దీని ద్వారా వరికి ఆశించే పురుగులు తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. పిఎం కిసాన్ ద్వారా ఐదు శాతం ఫిజికల్ వెరిఫికేషన్‌లో వచ్చిన రికార్డులను తనిఖీ చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విఒఎలకు కేటాయించిన మట్టి నమూనాలను ఆన్‌లైన్‌లో త్వరితగతిన నమోదు చేయాలని, రైతులు ఎద జల్లు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విఒఎలు ఎప్పటికప్పుడే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ ఎఒ జరీనా, మండల, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జనసేన నేతకు పలువురి పరామర్శ

ద్వారకాతిరుమల రూరల్ : కొంతమంది వ్యక్తుల దాడిలో గాయపడిన మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన జనసేన నేత పవన్‌కుమార్‌ను పలువురు జనసేన నాయకులు పరామర్శించారు. ఆదివారం సుమారు తొమ్మిది గంటల సమయంలో స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఉన్న విఎస్ మార్ట్‌కు సరుకుల నిమిత్తం వెళ్లిన తనపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారని బాధితుడు పవన్‌కుమార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం చికిత్స నిమిత్తం ద్వారకాతిరుమల ప్రభుత్వాసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొంది సోమవారం ఇంటికి వచ్చిన పవన్‌కుమార్‌ను పలువురు జనసేన నాయకులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చాక మండలంలో వైసిపి నాయకుల దాడులు ఎక్కువైపోయాయన్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పార్లమెంట్‌లో ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్ కుమార్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఏలూరు ఎంపీగా పోటీ చేయడానికి, ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీగా గెలిపించిన ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

తాగునీరు, డ్రెయినేజీలపై దృష్టి సారించాలి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎంఎల్ఎ ధర్మరాజు సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నియోజకవర్గంలో ప్రతి ఇంటికి రక్షిత తాగునీటిని అందించేలా గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులు చిత్తశుద్ధిగా పనిచేయాలని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నారాయణపురం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో డిఇలు, నాలుగు మండలాల ఎఇలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మంచి నీటి ట్యాంకులు కొత్తవి ఎక్కడెక్కడ అవసరం, సీసీ డ్రెయిన్లు, పైపు లైన్ల నిర్మాణం తదితర వాటికి నివేదిక అందించాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న పథకాలు, పనుల పురోగతిపై రిపోర్టు రెండు రోజుల్లో ఇవ్వాలని, వాటిని తీసుకెళ్లి సంబంధిత మంత్రి పవన్ కల్యాణ్‌తో మాట్లాడి నిధుల కోసం కృషి చేస్తానన్నారు. సగంలో నిలిచిపోయిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేయగలరని, గతంలో చేసిన పనులకు బిల్లులు ఎంత రావాలో వివరాలిస్తే బిల్లులు మంజూరు చేయిస్తామన్నారు. నూతన ప్రభుత్వ విధానం ప్రకారం శాఖ అధికారులు బాగా పనిచేసి ప్రజలకు నాణ్యమైన సేవలందించి సహకరించాలన్నారు. ఏలూరు డిఇ రమేష్, తాడేపల్లిగూడెం డిఇ, నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు మండల ఎఇలు సుబ్రహ్మణ్యం, రామారావు, హరినాథ్‌రాజు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారిపై సరైన రీతిలో సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో గత ఐదేళ్లలో ఎన్నో ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. కోమిరెపల్లి, సీతంపేట వంటి అనేక ప్రాంతాల్లో వైసిపి పాలకుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై కుటుంబ సభ్యులు మరణిస్తే ఆ బాధను తట్టుకోలేక వైసిపి పాలకుల నిర్లక్ష్యంపై ఆవేదనతో ధర్నా చేసిన అమాయక జనంపై సైతం కేసులు కట్టి వైసిపి ప్రభుత్వం వేధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కలపర్రు టోల్‌గేట్ నుంచి గుండుగోలను కూడలి వరకు జాతీయ రహదారిపై ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలీ, పెదవేగి తహశీల్దార్ నాగరాణి, ఆర్‌అండ్‌బి సూపరింటెండింగ్ ఇంజినీర్, నేషనల్ హైవే అధికారులు సహా పలువురు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లావణ్య వేణిని హైవే ప్రమాదాల నివారణకు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి తెలిపారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మాజీ ఎంపిపి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అధికారులు, నాయకుల సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపిపి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం టిడిపి నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు అధికారం కంటే గొప్పదైన బాధ్యతను అప్పగించారన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఇకపై ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామాల్లో జరిగే అభివద్ధి పనులు స్థానిక నాయకులకు తెలియజేస్తూ, అవినీతికి తావు లేకుండా పని చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన పనుల్లో అవినీతి, అక్రమాలు ఉంటే బయటకు తీయాలని స్థానిక నాయకులకు సూచించారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట లక్ష్మీనారాయణ, కాట్నీడు రాంబాబు, గండబోయిన శ్రీను, ముసునూరి బాలస్వామి, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, కాట్నీడు వెంకటరత్నం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కాపా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌ని ఆయన ఛాంబర్‌లో టిడిపి నూజివీడు నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, రాజధాని అమరావతి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే సిఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, జంగారెడ్డిగూడెం, డోరు నెం. 29-582 నివాశి పసుపులేటి వెంకట శివయ్య గారి భార్య పసుపులేటి నాగ దుర్గా (ఆధార్ నెం.672805 221892) అను నేను ది.24-06-2024వ తేదీన నరసాపురం బస్టాండ్ నుండి మా బంధువుల ఇంటికి వెళ్తుండగా నా హ్యాండ్ బ్యాగ్ నందు ఉంచుకున్న నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పడిపోయినది. నేను పాస్ పోర్ట్ ది.14-05-2013వ తేదీన L1620870గా వైజాగ్‌లో పొందియున్నాను. నేను ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయ వలసినదిగా కోరి ప్రార్ధించుచున్నాను.

పసుపులేటి నాగ దుర్గా, W/o.వెంకట శివయ్య,
జంగారెడ్డిగూడెం. ఫోన్ : 9347112283

దస్తావేజులు పోయినవి

ప.గో. జిల్లా యలమంచిలి మండలం గగ్గిపర్రు గ్రామ కాపురస్తులు కాపిశెట్టి ఉమా మహేశ్వరరావు C/o.కె.కృష్ణారావు, డోర్ నెంబర్ 6-4, గగ్గిపర్రు, అడవి పాలెం పంచాయతీ, యలమంచిలి మండలం కి చెందిన దస్తావేజు నెంబర్ 2827/2011 దస్తావేజులు జెరాక్స్ తీసికునే నిమిత్తం మోటార్ బైక్ పై మా ఇంటి నుంచి పాలకొల్లు సెంటర్ కు ది 17-6-2024న వెళ్తుండగా దారిలో పడిపోయినవి. దారిలో ఎంత వెదికినను సదరు దస్తావేజులు దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల పై చిరునామాలో ఇవ్వగలరు. తగిన పారితోషికం అందించబడును.

ఇట్లు
కాపిశెట్టి ఉమామహేశ్వరరావు
సెల్ : 7997406269
నా ఆధార్ నెంబర్ 555054612368

పబ్లిక్ నోటీసు

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) : AT KAIKALUR

O.S.No.54/2021

Between:
1.Vallabuni Seetha Rama Lakshmi and 7 others ...Plaintiffs
And
1.Kopanati Ramamohana Rao and 3 Others ...Defendants
To.
D-2 : Kopanati Gangadhar Rao, S/o.Late Narayan Dasu, R/o.Block-B, Flat No.303, K.K.Raju's Green City, Mini Bypass Road, Eluru, W.G.District.

పై నెంబరు దావాను వాదులు ప్రతివాదుల పై పార్టీషన్ నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో 2వ ప్రతివాదికి శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను 2వ ప్రతివాది పుచ్చుకొనక కాలయపన చేయుచున్నందున పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు అమలుకు శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు **ది.03.07.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పైకోర్టు నందు స్వయముగా గానీ, వకీలు గారి ద్వారా గానీ హజరై ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తదుపరి ఉత్తర్వులు పొందబడును.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది.03.07.2024 పి.పవన్‌కాంత్
వాదుల తరపు న్యాయవాదులు
ఫోన్ : 9490339161.

దావా సమను

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.19/2018

బిట్వీన్ :
విస్సా జుహిత్ మైనర్ అయినందున తల్లి మరియు సంరక్షకురాలు ఆచంట శ్రీదేవి ...వాది
Vs
విస్సా రామకృష్ణ @ రామకృష్ణారావు & 7 ఇతరులు ...ప్రతివాదులు
To.
5వ ప్రతివాది : యాతం రత్నకుమారి, W/o.వీర వెంకట బాపిరాజు, డోర్‌నెం.2-25/1, అడవిపాలెం, H/o.కొంతేరు, యలమంచిలి మండలం,ప.గో.జిల్లా.
6వ ప్రతివాది : కొడవతి పుష్పావతి, W/o.సత్యనారాయణ, ముచ్చర్లవారి లే అవుట్, పాలకొల్లు, పాలకొల్లు మండలం.

పై నెంబరు దావాలో 5,6 ప్రతివాదులు హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను ది.**4-7-2024** కు వాయిదా వేసినారు. కాబట్టి 5,6 ప్రతివాదులు పై నెంబరు దావాలో ది.**4-7-2024వ తేదీన ఉ.10.30 ని.లకు** స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కాని శ్రీకోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో 5,6 ప్రతివాదులు పరోక్షమందు పై నెంబరు దావా శ్రీకోర్టు వారు తీర్మానించెదరని తెల్పడమైనది.
(కోర్టు వారు ఉత్తర్వుల మేరకు)

పాలకొల్లు **జి.సత్యనారాయణ**
తేది.23-05-2024 అడ్వకేటు, పాలకొల్లు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

హెచ్.ఎమ్.ఓ.పి.నెం.75/2023

బిట్వీన్ :
సాలా రాజేష్, S/o.నాగేశ్వరరావు, హిందూ, పురుషుడు, 40 సం.రం.లు, డోర్ నెం.4-62-4, గాంధీపార్కువద్ద, వీకర్స్ కాలనీ, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, టిపిజి/ఎస్సిజె ...పిటీషనర్
మరియు
సాలా అనే పిరిగిన లక్ష్మీదుర్గ, భర్త సాలా రాజేష్, తండ్రి : పిరిగిన శ్రీను, హిందూ, స్త్రీ. 38 సం.లు, డోర్ నెం.1-184, అనంతపల్లి గ్రామం, నల్లజర్ల మండలం, తూర్పుగోదావరి జిల్లా. టిపిజి/ఎస్.సి.జె. ...రెస్పాండెంటు

పై నెంబరు గ్రంథములో పిటీషనర్ గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 08-07-2024వ** తేదీ సోమవారం నాటికి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు ఉదయం గం.10.30 నిల లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగ గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడేపల్లిగూడెం, **జి.వి. ద్వారకానాథ్,**
తేది.23-06-2024. డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది.